క్లుప్తంగా

నేడు సంబేపల్లెలో 'జగనన్నకు చెబుదాం'

సంబేపల్లె : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరుగనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ నరసింహులు తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉంటుందన్నారు.

16 నుంచి ప్రవచనాలు

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె గ్రామంలోని శ్రీకృష్ణ గీతా మందిరం నందు ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు శ్రీమత్ భగవద్గీత 12వ అధ్యాయం భక్తి యోగం పైన అచ్చోలి ముకుంధర రెడ్డిచే ప్రవచనాలు వినిపించడం జరుగుతుందని విశ్రాంత తహసీల్దార్ నాయనపల్లి జయన్న పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ప్రవచనాలు ఉంటాయన్నారు. మార్గశిర శుద్ధ ఏకాదశి నాడు శ్రీకృష్ణ పరమాత్మ అర్జునుడికి స్వయంగా గీతా సందేశమును వినిపించిన పర్వత దినమని తెలిపారు. ఈనెల 23వ తేదిన ముక్కోటి ఏకాదశి, గీతా జయంతిని పురస్కరించుకొని ఉదయం 9 గంటల నుండి 12.30 గంటల వరకు భగవద్గీత సంపూర్ణ పారాయణం జరుగునున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, భోజన ప్రసాద వితరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గెలిపి రత్నంశెట్టి పాల్గొన్నారు.

టీవీ వితరణ


టీవీని భవిత కేంద్రానికి ఇస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : మండలకేంద్రంలోని భవిత కార్యాలయంలో చదువుతున్న దివ్యాంగులకు ఉపాధ్యాయులు ఎం.సూర్యుడు నాయక్, బుక్కే కృష్ణవేణి దంపతులు గురువారం దివ్యాంగులకు రూ. 10 వేలు విలువచేసే టీవీని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దివ్యాంగులకు చేయూత నివ్వడం, వారి తోడ్పాటుకు దోహద పడడం ఎంతో గొప్ప విషయమన్నారు. ప్రభుత్వం కదలలేని దివ్యాంగులకు రూ. 3 వేలు ఇంటి వద్దకు ఇవ్వడం, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఆటో చార్జీలు ఇవ్వడం దీంతో విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్థికసాయం


ఆర్థికసాయం అందిస్తున్న మానవత సభ్యులు

చిట్వేలి : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చిట్వేలి శాఖ సభ్యులు గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. మండల పరిధిలోని కెఎస్ అగ్రహారం దళితవాడకు చెందిన మోడపోతుల నరసింహా గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్యానికి ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న నరసింహాకు గతంలో కొందరు దాతలు ఆర్థిక సహాయం అందించారు. ప్రస్తుతం వైద్యం చేయించుకునేందుకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న మానవత సభ్యులు రూ. 15200లు ఆర్థిక సాయాన్ని గురువారం సాయంత్రం అందజేశారు.

ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మల్లికార్జున



పెనగలూరు (ఓబుల వారిపల్లె) : ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పెనగలూరుకు చెందిన కోడూరు మల్లికార్జున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడంపట్ల ఆయన రాష్ట్ర నాయకులకు మల్లికార్జున కృతజ్ఞతలు తెలిపారు.

కనీస వేతనం చెల్లించాలి


ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

రాయచోటి అర్బన్ : ఆశ వర్కర్లకు కనీస వేతనంగా రూ. 26వేలు చెల్లించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కలెక్టరేట్ ఎదుట వంటావార్పు పేరుతో 36 గంటలపాటు ఆశ వర్కర్లు ధర్నాను సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు పి.శ్రీనివాసులు, కార్యదర్శి ఎ.రామాంజులు, మెహరున్నీసాలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తుండడం తగదన్నారు. ఆశల విధి నిర్వహణలో రాజకీయ జోక్యాన్ని నిలిపివేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన ఆశ వర్కర్ల కుటుంబాలకు నియామకంలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశ నాయకురాళ్లు ఫామిదా, సుధారాణి, నాగేశ్వరి, సునంద, రమా దేవి, సత్యవాణి, సంగీత, రోజా, జహరాబి పాల్గొన్నారు.

తుపాను బాధితులను ఆదుకుంటాం

రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి


ఒంటిమిట్ట: అరటి పంటను పరిశీలిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి


రాజంపేట రూరల్: నేలకొరిగిన అరటి గెలలను పరిశీలిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట : మిచాంగ్ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర ఉద్యాన శాఖ కమిటీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నరవకాటిపల్లిలో తుపాను వల్ల దెబ్బతిన్న అరటి పంటను రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దెబ్బతిన్న పంటల రైతులను ఆయన పరామర్శించి, ప్రభుత్వం తప్పకుండా మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అనంతరం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పంట చేతికి వస్తుందనుకుంటున్న తరుణంలో తుపాను కారణంగా దెబ్బతిని రైతులు నష్టపోవడం బాధాకరమన్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల కలెక్టర్లకు ఈనెల 18వ తేదీ లోపు పంట నష్టాన్ని గుర్తించి స్థానిక ఆర్‌బీకే కేంద్రల వద్ద ప్రదర్శించాలని ఆదేశాలిచ్చారన్నారు. అలానే ఈ నెల 22 లోపు తుది నివేదిక వచ్చాక, జనవరి మొదటి వారంలో నష్టపోయిన రైతులకు పరిహారం ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వాలు తుపాను కారణంగా నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం అందించడంలో విఫలమయ్యాయన్నారు. నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తీసుకొచ్చిన ఆర్‌బీకే వ్యవస్థ అసిస్టెంట్ల ద్వారా తుపాను వచ్చిన రెండు, మూడు రోజులకే దెబ్బతిన్న పంటలను అంచనా వేసి, ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, మండల ఉద్యాన శాఖ అధికారి సింధూరి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకు అండగా ఉంటాం

రాజంపేట రూరల్ : రాష్ట్రంలో మిచాంగ్ తుపాను వలన నష్టపోయిన రైతులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నష్ట పరిహారం చెల్లించి ఆదుకుంటారు అధైర్యపడవద్దని రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని హస్తవరం పంచాయతీలో నేల కొరిగిన అరటిని గురువారం సంబటూరు రైతులు, ఆర్‌బీకే అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుపాన్ వలన నష్టపోయిన ప్రతి రైతుకు సీఎం జగనన్న అండగా నిలుస్తారన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు రైతులు నష్టపోవడం బాధకరమన్నారు. నోటి దగ్గరకు వచ్చిన పంట నేలకొరగటం విచారకరమన్నారు. కేవలం రాజంపేట మండలంలో 1300 మందికి చెందిన 1072 హైక్టార్లలో అరటి నేలకొరిగిందని చెప్పారు. రైతులకు అండగా ఉండటంలోను, వివరాలు సేకరించడంలో చొరవ చూపుతున్న ఆర్‌బీకే అధికారుల పనితీరు ప్రశంసనీయం అన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ వ్యవసాయ జిల్లా సలహా కమిటీ సభ్యులు ఎస్.శివరామరాజు, వ్యవసాయ అధికారి సాగరిక, ఉద్యాన విస్తరణ అధికారి పూర్ణచంద్ర, మండలంలోని అన్ని ఆర్‌బీకేల అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

గాలివీడు : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ షబ్బీర్ అహమ్మద్ పేర్కొన్నారు. గురువారం గుండ్లచెరువు, గరుగుపల్లెల గ్రామాల సర్పంచ్‌లు ఇందుకూరి ఉమామహేశ్వరి, చింతంరెడ్డి జానకమ్మల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల వద్ద వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. వివిధ కేంద్ర పథకాలపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయంలో రైతులకు ఉపయోగపడే పరికరంపై రైతులకు, ప్రజలకు అవసరమయ్యే సంక్షేమ పథకాలపై అవగాహనకల్పించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఓబులవారిపల్లె : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగంపేట అగ్రహారానికి చెందిన పార్టీ కార్యకర్త జి.చంద్రాచారి(40) మృతి చెందిన విషయం తెలిసిందేనని పార్టీకి మొదటి నుంచి అన్ని కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటూ పార్టీకి సేవ చేశారన్నారు. చంద్రాచారి మరణం పార్టీకి లోటన్నారు. మృతుని కుటుంబాన్ని అన్నివిధాల సహకారం అందిస్తామన్నారు. రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే అందిస్తానని చెప్పారు. అంతేకాకుండా మృతుడి భార్య వాణికి జీవనోపాధిని సైతం కల్పిస్తానని ధైర్యం చెప్పారు.

ప్రకృతి వ్యవసాయానికి సర్టిఫికేషన్ తప్పనిసరి


మాట్లాడుతున్న దిన్నెపాడు రవిరాజు

రాయచోటి టౌన్ : ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు సర్టిఫికేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దిన్నెపాడు రవిరాజు తెలిపారు. గురువారం రాయచోటి మార్కెట్ యార్డులోని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు పండించిన రైతులు తప్పకుండా నిర్ధారణ పరీక్షలు (సర్టిఫికేషన్) తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. అలాగే ఈ పద్ధతిలో సాగు చేసిన పంటల వలన ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో వివరించారు. కార్యక్రమంలో డీపీఎం రామకృష్ణమరాజు, జూనియర్ టీఎల్ ప్రభాకర్, గుంటూరు నుంచి వచ్చిన ప్రతినిధులు ఎస్ఎఫ్ఏ పున్నారావు, జూనియర్ పీఈ పవన్, సీఎస్ఏ అశోక్ తదితరలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెను విరమింపజేయాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 12 నుంచి రాయచోటి సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ చేస్తున్న సమ్మెకు ఆ పార్టీ తరఫున ఆయన గురువారం మద్దతును తెలియజేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె కొనసాగితే తల్లీబిడ్డలకు ఎదురయ్యే సమస్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందంటూ హెచ్చరించారు. 2019 ఎన్నికల్లో అంగన్‌వాడీలకు తెలంగాణలో కంటే వెయ్యి రూపాయలు అదనంగా జీతం ఇస్తామని హామీ ఇచ్చిన పాలకులు మాటతప్పడం తగదన్నారు. కనీసవేతనం, గ్రాట్యుటీని అమలు చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం గతనాలుగేళ్లుగా పోరాడిన అంగన్‌వాడీలు చివరకు విసిగివేసారి సమ్మెకు దిగారన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరింపజేసి సమ్మెను విరమింపజేయాలంటూ కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లానేతలు రామాంజులు, రామచంద్ర, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జనసంద్రాన్ని జీర్ణించుకోలేక దుష్ప్రచారాలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రాజంపేట : నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన సామాజిక సాధికారిత బస్సుయాత్రకు అనూహ్య స్పందన లభించిందని రాజంపేట వైఎస్సార్‌సీపీ నేతలు, ఆర్‌డీసీ స్టేట్‌డైరక్టరు గండికోట గుల్జార్‌బాషా, వడ్డెర సంఘం రాష్ట్ర నేత వడ్డె రమణలు తెలిపారు. దీనిని జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేస్తోందని ధ్వజమెత్తారు. బుధవారం రాజంపేటలో వారు మాట్లాడుతూ సామాజిక సాధికారిక యాత్ర ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నాలుగన్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు తదితరులకు చేసిన సంక్షేమం గురించి వివరించామన్నారు. సభకు 15వేల మంది వచ్చారన్నారు. జనం రాకను చూసి జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. రాజంపేట జనసంద్రంగా మారిందని, ప్రత్యక్షంగా చూసిన ప్రతి ఒక్కరూ అంటుంటే ప్రతిపక్షాలు రాజకీయంగా ఎక్కడ దెబ్బతింటామోనని క్యాడర్‌ను కాపాడుకునేందుకు అసత్యాలను చెబుతోందని ఎద్దేవా చేశారు. యాత్ర విజయంపై సీఎం వైఎస్ జగన్ ఎమ్మెల్యే మేడాను అభినందించారని గుర్తుచేశారు. రాజంపేటలో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం అధినేతను ముఖ్యమంత్రిని చేసుకునేలా పని చేస్తామని తెలియజేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ


ఆకట్టుకున్న 18 మెట్ల మండపం

లక్కిరెడ్డిపల్లె : ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే అయ్యప్ప దీక్ష పరామర్థమని నామాల గుట్ట అయ్యప్ప గురుస్వాములు గంగరాజు, వెంకటేష్, నాగేంద్ర, నరసింహారెడ్డి, గంగాధర్ రాజు, సుధీర్‌లు పేర్కొన్నారు. గురువారం రాత్రి గురవయ్యగారిపల్లికి చెందిన సుధీర్ పాపయ్య బంధుమిత్రులు జగదీష్, సత్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో అయ్యప్ప మాలాధారణ భక్తులు పాల్గొని అయ్యప్ప భజనలతో పరవసించారు. పడిపూజ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 18 మెట్ల మండపం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అయ్యప్ప పడిపూజ, అన్నదాన కార్యక్రమానికి రూ. 50 వేలు విరాళంగా అందించడంతోపాటు నామాలగుట్టపై నూతనంగా నిర్మాణం చేపడుతున్న అయ్యప్ప ఆలయానికి కూడా రూ. 50 వేలు కమిటీకి అందించడం పట్ల గురుస్వాములు వారిని అభినందించారు. అనంతరం భిక్షను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు సుబ్బయ్య, పద్మేష్, భజన నాగరాజు, సురేంద్రారెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, వెంకట్రామి రెడ్డి, కార్తీక్, పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సురక్ష బీమా యోజన ఓ వరం


బీమా చెక్కును అందిస్తున్న మేనేజర్ మంజుల

రామాపురం : సురక్ష బీమా యోజన పథకం ఖాతాదారులకు ఒక వరం లాంటిదని మండల ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కడియాల మంజుల అన్నారు. గురువారం మాట్లాడుతూ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన గంప శ్రీనివాసులు కుటుంబానికి రూ. 2లక్షలు ప్రమాద బీమా చెక్కును అందజేశారు. నల్లగుట్టపల్లె గ్రామం బీసీ కాలనీకి చెందిన గంప శ్రీనివాసులు మరణించడంతో అతను ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో ఖాతా కలిగి సురక్ష బీమా యోజన కింద రూ.20లు జమ చేయడం జరిగిందని, దీంతో శ్రీనివాసులు కుటుంబానికి రూ. 4లక్షలు ప్రమాద బీమా మంజూరు అయ్యిందని, అందులో రూ. 2లక్షలు గంప రెడ్డమ్మకు అందించినట్లు తెలిపారు. సమావేశంలో బ్యాంక్ సిబ్బంది, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సాయినాథుడికి ప్రత్యేక పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలో కొలువైన సాయిబాబా ఆలయంలో గురువారం అర్చకులు బండాత్మకూరు సతీష్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. సాయినాథుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి ఉంజల్, పల్లకీ సేవలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పూజల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'వచ్చారు.. వెళ్లిపోయారు'

లక్కిరెడ్డిపల్లె : కరువు ప్రాంతాల పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం వచ్చారు, తూతూ మంత్రంగా పరిశీలించి వెళ్లారని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగమల్ల రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన లక్కిరెడ్డిపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏపీలో కరువు పర్యటన పరిశీలనకై వచ్చారు కానీ, ఎక్కడ గానీ నష్టపోయిన రైతులతో మాట్లాడకుండా కారులో వచ్చిన అధికారులు వెళ్లిపోయారన్నారు. లిస్టులో ఉన్న మండలాలను రద్దు చేసుకుంటూ కొన్ని మండలాల్లో మాత్రమే పంటలు పరిశీలించారన్నారు. జిల్లాలో కరువు తీవ్రంగా ఉంటే ఏ నియోజకవర్గాలలో ఏ పంట దెబ్బతిన్నది, ఏ మండలంలో ఏ రైతు నష్టపోయాడని పరిశీలించకుండా చేతులు దులుపుకొని వెళ్లిపోయారని వారన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద ఎకరాకు రూ. 10 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కృష్ణదేవరాయ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ భూముల పరిశీలన


అనంతరాజుపేట సత్రం భూమిని పరిశీలిస్తున్న ఏసీ


రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అనంతరాజుపేట, ఉర్లగడ్డపోడు, బొజ్జవారిపల్లి గ్రామాలలోని దేవాదాయ, ధర్మాదాయశాఖ భూములను ఏసీ విశ్వనాథ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని కోర్టు వ్యవహారాలపై నెమలి వెంకటరామయ్యకు సంబంధించిన భూముల విషయాలపై, అలాగే దేవాదాయ, ధర్మాదాయ భూములకు సంబంధించి పరిశీలించినట్లు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే రెవెన్యూశాఖ అధికారులతో ఆయన చర్చించారు. కార్యక్రమంలో సిబ్బంది సుదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో గుంతల పూడ్చివేత


గుంతలు పూడ్చివేయిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆవరణలో గుంతలు ఉండటంతో వర్షం వస్తే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో భూగర్భ గనులశాఖ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి సహకారంతో, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చొరవతో గురువారం పాఠశాల ఆవరణలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, తహసీల్దార్ నరసింహకుమార్‌లు గుంతలు పూడ్చివేయించారు. దీంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యులు నాగిరెడ్డి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి


బోరుబావికి మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

వీరబల్లె (రాయచోటి టౌన్) : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి అన్నారు. గురువారం వీరబల్లె మండలం మట్లి గ్రామంలోని తొగటిపల్లెలో బోరుబావి మరమ్మతులకు నోచుకోవడంతో తాగునీటి సమస్య ఉన్నట్లు తెలియడంతో ఆయన వెళ్లి పరిశీలించారు. అప్పటికప్పుడే సమస్య పరిష్కరించి బోరును రిపేరు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక సమస్యలు కల్పించడానికి తాను ఎప్పుడూ ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఆ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

భూ హక్కుల చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

లక్కిరెడ్డిపల్లె : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూ హక్కుల చట్టం భూ కబ్జాదారులు చట్టబద్ధంగా పేదల భూములను కబ్జాలు చేసుకోవడానికి ఉపయోగపడుతుంది తప్పా సామాన్యులకు ఎటువంటి ఉపయోగం లేదని లక్కిరెడ్డిపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, కార్యదర్శి చెన్నకృష్ణయ్యలు అన్నారు. భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కడప, అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ నేతృత్వంలో గురువారం లక్కిరెడ్డిపల్లె జూనియర్ సివిల్ కోర్టు మెయిన్ గేటు వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబరు 512 రద్దు చేయాలని, ప్రస్తుత ఆస్తులకు భద్రతలేని భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కోర్టులను అవమానించే యాక్ట్ 27/23ని అమలు చేయడం ఆపాలని, న్యాయవ్యవస్థను అదుపు ఆజ్ఞల్లో పెట్టుకునే విధంగా తయారు చేసిన భూ హక్కుల చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని న్యాయవాదాలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎల్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆస్తుల వివాదాలపై హక్కును నిర్ణయించే అధికారం రెవెన్యూ అధికారులకు ఇవ్వడం సరైన పద్ధతి కాదని, ఇది రాజ్యాంగ విరుద్ధమైన చర్య అని ఆయన అన్నారు. రకాలుగా సుప్రీంకోర్టు చెప్పిందని, మన రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చట్టాన్ని తీసుకురావడం ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని ఆయన అన్నారు. సీనియర్ న్యాయవాది చెన్న కృష్ణయ్య మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి కూడా రెవెన్యూ కోర్టులు ఇచ్చే తీర్పులను న్యాయవ్యవస్థ గౌరవిస్తూనే ఉందని, అయితే ప్రస్తుతం న్యాయవ్యవస్థను అగౌరవపరిచే విధంగా భూహక్కుల చట్టం ఉందని, ఎటువంటి పరిస్థితుల్లో ఈ చట్టాన్ని అమలు చేయడానికి వీలు లేదన్నారు. కార్యక్రమంలో ఏజీపీ బాలజీరెడ్డి, పౌర హక్కుల సంఘం న్యాయవాది రవిశంకర్, టీవీ రమణ, వి.రాజ్ కుమార్, సుబ్బరాయుడు, కక్షిదారులు రెడ్డి శివశంకర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలి

రాయచోటి అర్బన్ : కరువుతో పాటు తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలు పార్టీలు, సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో రైతులు, కూలీలు కోసం చేయాల్సిన సహాయక చర్యలు చేపట్టి రైతాంగాన్ని ఆదుకోవాలన్న డిమాండ్‌తో ధర్నా కార్యక్రమం జరిగింది. ధర్నాలో పలువురు మాట్లాడుతూ జిల్లాలోని రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లోని రైతాంగం మిచాంగ్ తుపానుతో తీవ్రంగా నష్టపోయిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న పంటలను పరిశీలించడం తప్ప నేటి వరకు రైతాంగానికి ఒరిగిందేమి లేదన్నారు. కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటిస్తే వారిని ఆర్‌బీకే సెంటర్లకే పరిమితం చేసి నష్టపోయిన రైతాంగంతో మాట్లాడకుండా చేయడం దారుణమన్నారు. అధికారులు సైతం తూతూమంత్రంగా కరువును పరిశీలించడం సిగ్గుచేటన్నారు. అన్నిపంటలకు పంటల భీమా వర్తింప చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ధర్నాలో మహేష్, ఎస్.శ్రీనివాసులు, చెన్నక్రిష్ణ, యుగంధర్, తోపు క్రిష్ణప్ప, వంగిమళ్ల రంగారెడ్డి, సుధీర్‌కుమార్, సుమిత్ర, కోటేశ్వరరావు, వినయ్, వెంకటేష్, పుల్లయ్య తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఆకుకూరలకు భలే గిరాకీ


రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో కొందరు రైతులు ఆకుకూర పంటలతో చింతలేని జీవితాన్ని గడుపుతున్నారు. ముఖ్యంగా రాఘవరాజపురం, రెడ్డివారిపల్లి, కొత్తపల్లి, బొజ్జవారిపల్లి, కేసీఅగ్రహారం గ్రామాలలో పలువురు రైతులు ఎకరా, అరెకరా ఉండటంతో చిన్నచిన్న కయ్యలు చేసుకుని పలు రకాల ఆకుకూరలు పండించుకుంటూ మంచి లాభాలు సాధిస్తున్నారు. ఆకుకూరల్లో కొత్తిమీర, కరివేపాకు, చూక్కాకు, పాలకూర, గోంగూర, తోటకూర, చిర్రిఆకు, మెంతి మొదలకు ఆకుకూరలను పండిస్తూ ప్రతినిత్యం వాటిని రైల్వేకోడూరు మార్కెట్‌కు తరలిస్తూ రోజువారి ఆదాయాన్ని కళ్ల చూస్తున్నారు. కొద్దిపాటి పొలమున్నా వాటిలో 20రోజులు, 15రోజులు, నెల, 50రోజులలోపు వచ్చే ఈ ఆకుకూరలు, చిన్నపాటి కూరగాయలు పండించుకుంటూ తమ జీవితాలను చింతల్లేకుండా నెట్టుకొస్తున్నారు. మార్కెట్‌లో ఆకుకూరలకు మంచి గిరాకీ ఉంటుంది. ఈ ఆకుకూరలపై మరి కొందరు ఆధారపడి రైతుల దగ్గర కొనుగోలు చేసి మార్కెట్‌కు తరలించి బాగా సంపాదిస్తున్నారు. ఒక్కొక్క పంటకు రూ.2వేల నుంచి రూ.3 వేలలోపు ఖర్చువచ్చి.. రూ.10వేలలోపు ఆదాయం వస్తుంటుంది. కూలీల బెడదలేకుండా కుటుంబంలో ఇద్దరు, ముగ్గురే పనిచేసుకోవచ్చు. దీనివల్ల పెట్టుబడి లేకుండా రోజువారి సంపాదన వస్తుంటుంది. ప్రతి నిత్యం ప్రజలు ఆకుకూరలపై ఆధారపడుతూ ఉండటంతో ఆకుకూరలకు గిరాకీ బాగుంది. వైద్యుల సూచనల వల్ల పలువురు ఆకుకూరలపైనే దృష్టి సారిస్తుంటారు.

తిరుమల పాదయాత్రకు సంఘీభావం


కడప డిప్యూటీ మేయర్ పాదయాత్రలో పాల్గొన్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

సిద్దవటం : కడప నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి గోవింద మాల ధరించి తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర గురువారం మధ్యాహ్నానికి సిద్దవటం మండలంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్దకు చేరడంతో వారికి వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి ఏర్పాటు చేసి వారికి సిద్దవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మాజీ సర్పంచ్ కె.వి.సుబ్బయ్య, రావుల సబ్బారెడ్డిలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. సంఘీభావంగా పాదయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయభాస్కర్‌రెడ్డి, శాంతమ్మ, మనోజ్ కుమార్, గరుడాద్రి, విజయకుమార్‌రెడ్డి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం


స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం మహవీర్ సర్కిల్‌లో నాగులకట్ట వద్దగల శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ గోవిందమాల భక్తుల బృందం డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో గురువారం శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేద పండితులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజల అనంతరం కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కల్యాణమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందమాల ధారులైన డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి బృందం కల్యాణం అనంతరం పాదయాత్రగా తిరుమలకు బయలుదేరింది.

శ్రీనివాసుని కృప కోసం...

జిల్లాపై శ్రీనివాసుని కృప ఉండాలని కోరుతూ 21 సంవత్సరాలుగా స్థానిక భక్తులతో కలిసి అన్నమయ్య కాలిబాటన గోవిందమాల ధరించి పాదయాత్ర నిర్వహిస్తున్నామని కల్యాణోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు.